గంజి కేంద్రం

"అవ్వగారూ, మీరు అన్నం అత్తిసరు పెడతారా, వారుస్తారా?"

"పొద్దున వారుస్తా, నాయనా! రాత్రి అత్తిసరు పెడుతున్నా. ఏం?"

"మరేంలేదు. వార్చినగంజి ఏం చేస్తారు? కుడితితొట్లో పొయ్యటానికి గొడ్డూ గోదా లేదుగా?"

"గంజి పట్టడంకూడానా? తూములోకి వార్చేస్తా."

"అట్లా అయితే ఒక పనిచేస్తారూ?"

"ఏమిటి నాయనా?"

"ఇవాళనుంచీ మీరు అన్నంవార్పునీళ్లు దేనిలోకన్నా పట్టి నా కిస్తూఉండండి."

"సీకా"

"మరేం లేదు. ఆమధ్య రాయలసీమలో నడిపిన గంజికేంద్రాలున్నాయి చూడండి. అవి అంత సంతృప్తికరంగా లేవనీ, వాటినిగురించి కొంత పరిశోధన జరగాలనీ మా ఆఫీసరుగా రంటున్నారు. నేనూ మరికొందరమూ కలిసి పరిశోధనలు జరుపుదామని!"

"దానికేం భాగ్యం, నాయనా! అట్లాగే ఇస్తాలే!"

తన నాయనమ్మకూ, తమ వెనకగదిలో అద్దెకుంటున్న శ్రీనివాసరావుకూ మధ్య జరిగిన ఈ సంభాషణ యావత్తూ పంకజం విన్నది. ఆమెకు కోపం వచ్చింది.

అతన్ని చూస్తే ఆమెకు తరుచు కోపమేవచ్చేది. కారణం ఆమెకే తెలీదు. అతను తనకు గాని ఇతరులకు గాని ద్రోహం ఏమీ చెయ్యలేదు. వీలయితే సహాయంకూడా చేసేవాడు. ఎన్నోసార్లు లైట్లకు ఫ్యూజ్ పోతే వేసిపెట్టాడు. ఒకసారి చెడిపోయిన బల్బును మళ్ళీ వెలిగేట్టు చేశాడుకూడా. చదువులో ఎప్పుడైనా తనకు సహాయపడతాడు. ఆవిషయంలో అతన్నిగురించి ఆక్షేపణ ఏమీలేదు. అద్దె సరిగా ఇచ్చేవాడు కాడు నిజమేగాని, ఆ విషయం పంకజాన్ని అంత బాధించేది కాదు. ఏ బుద్ధినఉండో తన తండ్రి ఈ శ్రీనివాసరావు కా గది ఇచ్చాడు గాని అంతకుపూర్వం అది తమ కిందనే ఉండేది. పనికిరాని సామాన్లు అందులో పడేసేవాళ్లు. శ్రీనివాసరావుకోసం స్నేహితులు వస్తూండే వాళ్ళు. రోజుల తరబడి వెళ్ళేవాళ్ళు కారు. అందువల్లకూడా పంకజానికి బాధ లేదు.

శ్రీనివాసరావుమీద పంకజానికి అప్పుడప్పుడూ వచ్చే కోపానికి కారణం అనుమానం. ఆరునెలలనుంచీ అతను తమ ఇంట్లో ఉంటున్నప్పటికీ అతన్నిగురించి పంకజానికి స్పష్టంగా ఒక్క విషయమైనా తెలియదు. అతను ఏ ఆఫీసులో పని చేస్తున్నాడు? అతని జీతం ఎంత? ఏ హోటల్లో తింటున్నాడు? అస లతని దేవూరు? ఇలాటి చిన్న ప్రశ్నలకు కూడా పంకజానికి సరిఅయిన సమాధానాలు తెలీవు. ఆమెతండ్రికి ఇలాటి వివరాలు తెలుసుకోవటంలో ఆసక్తిలేదు. తానే అడిగితే అతను అర్థం అయీ కాకుండా చెప్పేవాడు. అతను చెప్పేది ఒక్కటీ విశ్వసనీయంగా కనపడేదికాదు. వచ్చిన కొత్తలో

శ్రీనివాసరావు తాను ఏదో ఆఫీసులో రికార్డు కీపరుగా పనిచేస్తున్నానన్నాడు. అమధ్య మాటల సందర్భంలో తాను అప్పర్ డివిజన్ క్లర్కునన్నాడు. రికార్డుకీపరు పని ఏమయిందంటే అది రెండునెలలక్రితమే అయిపోయిందన్నాడు. పర్యవసానం, పంకజానికి రెండూ అబద్ధమేనని తోచింది. ఒకనాడు అతనూ మరొక మిత్రుడూ కలిసి గదిలో వంటపెట్టటం చూసింది. ఇదేమిటంటే తాను భోంచేసే హోటల్లో ఒకడు కలరాతగిలి చచ్చాడనీ, హోటలు మూశారనీ చెప్పాడు. ఆసంగతి తనూ విన్నది. అందుచేత నిజమేనని నమ్మగలిగింది. కాని ఇంకా పట్నంలో ఎన్ని హోటళ్లులేవు? ఈ మాటంటే, "ఏహోటలునూ నమ్మటానికివీల్లేదు" అన్నాడు శ్రీనివాసరావు.

"నమ్మటానికి వీల్లేంది హోటళ్లనేకాదు-నిన్ను కూడా" అనుకున్నది పంకజం ... వంట పెట్టినవాళ్ళు కూరలోకి పోపుగింజలసంగతికూడా ఆలోచించకుండా మొదలుపెట్టారు. తాను వెళ్ళి వాళ్ళకు సహాయం చెయ్యటమే గాక మినప్పప్పూ, ఆవాలూ, ఇనపగరిటే, కత్తిపీటా వాళ్లకి ఎరువివ్వాలిసి వచ్చింది!

పంకజం అతని గదిలోకి వెళ్లటం అదే మొదటిసారి. గదిలో ఆటే సామానులేదు. కుప్పతెప్పలుగా పుస్తకాలున్నాయి. గదినిబట్టి శ్రీనివాసరావు రహస్యాలేమీ ఆమె గ్రహించలేకపోయింది. అతనికి ఆటే బట్టలులేవని మాత్రం తెలుసుకున్నది. అతను బయటికిపోతూ లోపలికివస్తూ కనిపించినప్పుడు బాగానే డ్రెస్ చేసుకున్నట్టు కనపడేవాడు. రెండు మూడు రకాల దుస్తులున్నట్టు కనబడేవాడు. అతని

కున్న వే రెండుమూడు జతలని ఆమె ఊహించలేదు. ఆ సంగతి ఇప్పు డామెకు తెలిసింది.

ఈ ఆరునెలల కాలంలో అతను రెండుసార్లు సైముకు అద్దె ఇవ్వలేకపోయాడు. ఒకసారి తన చెల్లెలు డబ్బుకోసం రాస్తే దగ్గిర ఉన్నదంతా పంపేశానన్నాడు. ఒకసారి తన మేనగోడలు పెనిమిటిని ఆదుకోవాలిసొచ్చిందన్నాడు. రెండు సార్లూ అతనిమాటలు పంకజంచెవులకు అబద్ధంగానే వినిపించాయి. అయినప్పటికీ అతను డబ్బు కిబ్బందిపడేవాడి లాగా ఎన్నడూ కనిపించలేదు. ఈనెల అద్దె ఇవ్వకపోతే వచ్చేనెలలో రెండునెలల అద్దే ఇచ్చేసేవాడు. సంపాదన తక్కువ గనక పొదుపుగా జీవిస్తూవచ్చాడేమో గాని, చేబదుళ్ళు తీసుకుని ఎగగొట్టే గర్భదరిద్రుడుగా అత నెన్నడూ కనిపించలేదు.

ఇప్పుడు గంజి కావాలంటున్నాడు, గంజి పరిశోధన లంటున్నాడు. ఇటువంటి కబుర్లు వినేవాళ్ళకి అబద్ధాలుగా వినిపిస్తాయని అతనికి తెలీదో, లేక తన చెవులే పాడువో అను కున్నది పంకజం.

2

నాలుగురోజులు గడిచాయి.

"ఏమండీ, అవ్వగారూ, ఇవాళ అత్తిసరు పెట్టారల్లే ఉందే?"

"లేదు, నాయనా! గంజివార్చా. మా పంకజం బట్ట లకు పెట్టాలని తీసుకుంది. అంతగా అయితే రాత్రికి అన్నం వారుస్తాలే"

"పోనివ్వండి. తొందర ఏమీలేదు. అవ్వగారూ, పైత్యానికి ఏం తింటే మంచిది?"

"నీ కేనా, నాయనా? వొంటో సరిగా లేదా?"

"మరేం లేదండీ. కడుపులో తిప్పుతోంది. ఈ పూట మాడదామనుకుంటున్నాను"

"పాత ఉసిరికాయ ఉంది. అది వేసుకుని రెండుముద్దలు తిను. అసలే నీరసంగా ఉన్నట్టున్నావు. ఏమీ తినకపోతె నీరసపడిపోతావేమో?"

"పచ్చడి ఇప్పించండి. దాంతోనే రెండుముద్దలు తిని ఇంత చారన్నం తిని వచ్చేస్తాను."

"ఈ భాగ్యానికి హోటలు కెందుకుపోతావు నాయనా? కాస్త అన్నం నే పెడతాలే. రెండునిమిషాల్లో చారుపెట్టిస్తా"

"అన్నీ అబద్ధాలు! అన్నీ అబద్ధాలు!" అనుకున్నది పంకజం ఈ మాటలు వింటూ. తనకూ, ఈ శ్రీనివాసరావుకూ మధ్య ఏదో షష్టాష్టకం! అతను ఏం చెప్పినా తన చెవులకు పచ్చి అబద్ధాలుగా వినపడవలసిందే!

మరో అరగంటకు అవ్వ, "పంకజం!" అని పిలిచింది.

పంకజం వంటింట్లోకి తొంగిచూసి, "ఏం!" అన్నది.

"ఆ అబ్బాయిని అన్నానికి రమ్మనమ్మా"

పంకజం శ్రీనివాసరావు గదిలోకి తొంగిచూసింది. అతను నిద్రపోతున్నాడు. కనీసం పంకజానికి మొదట అట్లా కనబడింది. మరుక్షణం ఏకంగా అతను చచ్చాడనే అనుకున్నది—అతను ఊపిరికూడా పీలుస్తున్నట్టులేదు! అతనిపై తనకుగల అనుమానాన్ని కనిపెట్టి దగ్గిరికివెళ్ళి చూసింది,

సొంతం చావలేదని రూఢిచేసుకున్నది. "ఇదుగో, ఏమండీ!" అని పిలిచింది. అతను పలుకలేదు. మొహమాటానికిపోతే లాభంలేదని చేత్తో తట్టింది. శ్రీనివాసరావు కళ్ళు తెరిచాడు.

"అన్నానికి వస్తారా?"

"విస్తట్లో కాస్త తెచ్చిపెట్టు. కొంచెంసేపుండి తింటాను" అన్నాడు శ్రీనివాసరావు మళ్ళీ కళ్ళుమూసుకుంటూ.

ఈ సందేశాన్ని పంకజం అవ్వకు అందజేసింది. అవ్వ విస్తరినిండా చేసినవన్నీ వడ్డించి పంకజాన్ని తీసుకుపొమ్మన్నది.

"అన్నం వొద్దో అనేవాడి కివన్నీ దేనికీ ?" అన్నది పంకజం.

"అన్నీ ఎక్కడే? ఒక చుక్క దోసకాయ పప్పూ, ఒక చుక్క కాకరకాయ కూరా! తినకపోతే వొదిలెయ్యనీ. మొదటి ముద్దమటుకు ఉసిరికాయ తినమను. గాజుగ్లాసులో చారు పట్టుకుపో. కాస్త నెయ్యీ, మజ్జిగా కూడా పెట్టిరా"

తన వంట ఎంతమంది మెచ్చుకుంటే అవ్వగారికి అంత సంతోషం. శ్రీనివాసరావు గంజి పరిశోధనలు చేస్తున్నానన్నప్పుడు తానుకూడా సహాయం చేస్తానందామని ఆవిడకు నోటిదాకా వచ్చింది. ఒక గంజినేకాదు గడ్డినికూడా రుచిగా తయారుచెయ్యొచ్చు, చేతి తీరు బాగుండాలేగాని !

3

పంకజం తండ్రి ప్రసాదరావుగారు భోంచేస్తున్నాడు. తల్లి వడ్డిస్తున్నది. పంకజానికి సంబంధంగురించి మాట్లాడుతున్నాడు.

"కుర్రా డిక్కడే డాక్టరీ చదువుతున్నాడు. తల్లిదండ్రు లిద్దరూ చిన్నతనంలోనే పోయారుట. పెద్దఅన్న పెంచాడు, చదివిస్తున్నాడు. కుర్రాణ్ణికూడా చూశా. ఫరవాలా. బాగానే ఉంటాడు" అన్నాడు ప్రసాదరావుగారు.

"పోనీరా. అంతగా అయితే పెళ్ళయినాక మనింటోనే ఉంటాడు. నేను హారీ అంటే పిల్లేకాదుట్రా నీకు ఆడదిక్కూ! నీ కూతురూ, నీ అల్లుడూ నీదగ్గిరే ఉంటారు, సరిపోతుంది. పప్పు కుదిరిందట్రా, నాయనా!"

"కుదరట మేమిటమ్మోవ్? అద్భుతంగా కుదిరింది."

"అట్లాగుట్రా, నాయనా. చెడగొట్టానేమో ననుకున్నాను సుమా. మరేంలేదు, ఉప్పు జాస్తి వేశా ననిపించింది. పప్పేమో ఎంతకీ ఉడకలా."

"ఒక్కనాటి కనుకోకు. దివ్యంగాఉంది. ఏదీ ఇంకొక్క చుక్క వెయ్యా."

మరికొంచం పప్పు వేయించుకుని కలుపుకుని ముద్ద నోట్లో పెట్టుకోబోతున్న ప్రసాదరావు ఆగి, "ఎవరో వాంతి చేసుకుంటున్నట్టుం దే!" అన్నాడు.

"ఆ శ్రీనివాసరావల్లే ఉంది" అన్నది పంకజం.

కాని పంకజం అప్పుడే దొడ్లోకి పరుగెత్తింది. శ్రీనివాసరావు తిన్న అన్నమంతా వాంతిచేసుకున్నాడు. కడుపు అంత బాగాలేనివాడు పెట్టినదంతా ఎందుకు తినాలీ!" అతని మీద ఆమెకు కోపమూ, అసహ్యమూ కలిగాయి. అరగనిది తినేవాళ్ళూ, చాతగాని పనికి పూనుకునేవాళ్ళూ అంటే ఆమె కెందుకో మంట.

ఈ మంటలో కూడా శ్రీనివాసరావు లేవలేనిస్థితిలో ఉన్నాడని తెలుసుకున్నది. దగ్గిరికి వెళ్ళి పట్టుకుని లేవదీసింది. గది వాకిట్లోకి తీసుకొచ్చి కూచోబెట్టి ప్రక్కాళించటానికి కాసిని నీళ్ళిచ్చింది.

"శ్రమఇస్తున్నాను" అన్నాడు శ్రీనివాసరావు అస్పష్టంగా.

"అన్నం తినకుండా మానేస్తే సరిపోయేది" అన్నది పంకజం.

"అప్పటికే మానేశాను" అన్నాడు శ్రీనివాసరావు లేచి గదిలోకి వెళ్ళటానికి ప్రయత్నిస్తూ.

"జబ్బేమిటో డాక్టరుకు చూపించరాదూ?" అన్నది.

"వద్దు, వద్దు! డాక్టరేం చేస్తాడు? జబ్బేమీ లేదు" అన్నాడు శ్రీనివాసరావు కంగారుగా.

కాని ప్రసాదరావు పట్టుపట్టి డాక్టరును పిలిపించాడు. శ్రీనివాసరావుకు కలరా కాదని తేల్చుకునేదాకా ఆయనకు నిద్రపట్టేటట్టు కనపడలేదు.

డాక్టరు వచ్చి శ్రీనివాసరావును పరీక్షించాడు. కలరా కాదన్నాడు. నీరసం తప్ప మరేజబ్బూ లేదన్నాడు. పాలూ, పళ్లూ, మంచినీళ్ళలో గ్లూకోసూ ఇమ్మన్నాడు. ప్రసాదరావుగారు డాక్టరుచెప్పినవన్నీ తెప్పించాడు, పంకజం వాటిని శ్రీనివాసరావు గదికి చేర్చింది.

శ్రీనివాసరావు పంకజాన్ని చూడగానే లేచి కూచున్నాడు. అత నింకా నీరసంగానే ఉన్నాడు గాని అతని మొహంలో దైన్యంలేదు.

"ఎందు కివన్నీ ఈ గంజికేంద్రంలో?" అన్నా డతను.

పంకజానికి అర్థంకాలేదు. "డాక్టరుగా రిప్పించమన్నారు. వద్దా?" అన్న దామె.

"ఇస్తే మహారాజుగా తీసుకుంటాను. కాని కావలసిందిమటుకు ఇది కాదు."

"మరేమిటి?"

"శ్రీనివాసరావు నీరసంగా చిరునవ్వు నవ్వాడు.

"ఉద్యోగం! డబ్బు! తిండి! మాడేపొట్టమీద అన్నం తింటే ఇముడలేదు. అనవసరంగా డాక్టరును పిలిపించారు... మీకందరికీ నిష్కారణంగా శ్రమఅయింది."

తన జీవితంలో మొదటిసారి పంకజం ఇతని మాటలు నమ్మగలిగింది. ఆమె అతనికి కాసిని వేడిపాలు తాగటానికిచ్చి బత్తాయి ఒకటి వొలుస్తూ, "మీ ఉద్యోగాలన్నీ అబద్ధమేనా?"

"అబద్ధంకాదు. నేను మద్రాసు సెక్రెటేరియట్‌లో పనిచేశాను. ఆంధ్రరాష్ట్రంతోబాటు కర్నూలుకు వెళ్లాను. డేరాల్లో మకాం పెట్టాను. మా డేరాలో మొదట అయిదుగురం. ఒకడు రెండోరోజే ఉద్యోగానికి రాజీనామా ఇచ్చి వెళ్ళాడు. మరి ఇద్దరు ఎవరినో పట్టుకుని మంచిచేసుకుని మా కాంపుకన్న మంచికాంపులోకి వెళ్ళిపోయారు. నాకు జ్వరంవచ్చి వొళ్ళు తెలియకుండా పడిపోయాను. బతికానా, చచ్చానా అని అడిగినవాళ్ళు లేరు. మందూ లేదు, మంచినీళ్ళూ లేవు. వారంరోజుల అవతల నాకు జ్వరం తగ్గేసరికి

నా సామానంతా మాయమయింది. నా ఆఫీసు పనిమాత్రం నాకోసం పేర్చిఉంది. రాత్రింబగళ్లు పనిచేసి అపని పూర్తి చెయ్యమన్నారు. ఆదివారాలు కూడా శెలవు తీసుకోవటానికి వీలులేదన్నారు. రాజీనామా ఇచ్చి వచ్చేశా. ఇక్కడికి వచ్చాక ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజివాళ్లు రెండు టెంపొరరీ ఉద్యోగాలిచ్చారు. నెలనుంచి ఊరకేనే ఉన్నా. వారం నుంచీ తిండిలేదు. నాకు ఉద్యోగంలేదనీ, తిండిలేదనీ ఎవరితో మొరబెట్టుకోను? ఎవరిని చేబదుళ్ళడగను? ఒకనెల అద్దె నాలుగురోజు లాలస్యంగా ఇస్తేనే నేను మీకెంతో తేలికయిపోతానే! స్నేహితులదగ్గిర చేబదుళ్ళు తీసుకుని ఇవ్వకపోతే ఏమవుతాను ?"

"అవును, నిజమే" అన్నది పంకజం.

"ఏం నాయనా! కాస్త లేచి ఎంగిలిపడతావా ?" అన్నది అవ్వగారు గదిలోకి తొంగిచూసి.

శ్రీనివాసరావు రొమ్ముమీద పుస్తకం పెట్టుకుని పడుకుని ఏదో ఆలోచిస్తున్నాడు. గదిలో దీపం వెలుగుతున్నది.

"ఎందుకులెండి!" అన్నా డతను.

"ఎందుకేమిటి, నాయనా. నీకోసం తేలిగ్గా చేశా."

శ్రీనివాసరావు లేచాడు. అవ్వగారివెంట వెళ్ళాడు. అవ్వగారు వంటింట్లో అతనికి పీటవేసి కూచోబెట్టింది.

"ఎవరూ ఇంట్లో లేనట్టున్నారే!" అన్నాడు శ్రీనివాసరావు.

"అమ్మాయికి ఏదో సంబంధమట. తండ్రీ కూతుళ్ళిద్దరూ చూడవెళ్ళారు. మొన్నటి శ్రావణపౌర్ణమికి పది

పేడుకూడా వెళ్ళాయి, పెళ్ళి చెయ్యొద్దా, నాయనా?" అన్నది అవ్వగారు వడ్డిస్తూ.

"కొంచెంగా పెట్టండి. అన్నానని కోప్పడకండి, అవ్వగారూ, మీ మూలంగానే నాకు పొద్దున అంత గొడవయింది."

"అదేమిటి, నాయనా?" అన్నది అవ్వ ఆదుర్దాగా.

"చాలా కొంచెంగా తిందామనుకున్నానుగాని, మీ చేతి మహత్యమేమిటో ఏదీ వదిలిపెట్టబుద్ధికాలేదు. మరీ కాకరకాయకూర చూశారూ, నా జన్మలో ఎన్నడూ అంత రుచిగా చేసిన కాకరకాయకూర తినలేదనుకోండి."

అవ్వగారి మొహం ఆనందంతో వికసించింది.

"కాకరకాయకూర బాగా కుదరలా మరీ?" అన్నదావిడ.

"బాగా అని మెల్లిగా అంటారేమిటి? నేనసలు కాకరకాయ నోటపెట్టను. అటువంటివాణ్ని ఆవురావురని తినేశాను. అంతా వాంతి అయిపోయింది. ఈ పూటైనా తేలిగ్గా తిననివ్వండి."

"ఎబ్బే, అసలు చేసిందేముందీ? కాస్త వెల్లుల్లి కారప్పొడీ, ఇంగువ చారూనూ. అన్నట్టు బచ్చలకూర పెసరపప్పులో వేశా. ఒక్కరవ్వ నాలిక్కి రాచుకుచూసి ఎట్లాఉందీ చెబుతావూ?"

"వద్దులెండి."

"ఎంత నాయనా, ఒక్కముద్దంటే ఒక్కముద్ద కలిపి చూడు."

"అద్భుతం! మీరు నలమహారాజును చంపిపుట్టారవ్వ గారూ!"

లేదూ లేదంటూనే అవ్వగారు శ్రీనివాసరావుచేత చేసిన వంటకాలన్నీ తినిపించింది. ప్రతిదీ అద్భుతమే నన్నాడు శ్రీనివాసరావు.

"నువ్విట్లా అంటున్నావా ? మా వాడికూ్కూడా నా వంటంటే ఎంతో ఇష్టం. నా మనవరాలికి మటుకు ఒకటీ నచ్చదు. ప్రతిదానికీ యేదో వంక పెడుతుంది"

"ఒక్కొక్కళ్ళ తీరు!" అన్నాడు శ్రీనివాసరావు.

"బాగా చెప్పావ్" అంది ముసలావిడ.

తండ్రీ కూతుళ్ళు ఇంటికి తిరిగొచ్చేసరికి తొమ్మిది దాటింది.

"ఆయన కన్నం పెట్టావా?" అని అడిగింది పంకజం అవ్వను చూస్తూనే.

"అతను తిని వెళ్ళి ఏ ఝామయింది? అయితే ఇంతకూ పెళ్ళికొడుకును చూశారుట్రా?" అన్నది అవ్వగారు.

"ఆ, చూడకేం!" అన్నాడు ప్రసాదరావుగారు.

"ఏమయిందేం?" అన్నది తల్లి.

"ఆయనకు పదివేలు కట్నం కావాలిట"

"ఆకలేస్తున్నది, అన్నం పెట్టవమ్మా" అన్నది పంకజం మాట మార్చటానికల్లే.

"పది వేలే!" అన్నది అవ్వగారు ముక్కుమీద వేలేసుకుని.

"అన్నం పెట్టవమ్మా అంటూంటే!" అన్నది పంకజం చిరాగ్గా.

"ఆ! పదివేలతో ఇద్దరల్లుళ్ళను కొనుక్కోవచ్చు" అన్నాడు ప్రసాదరావుగారు.

అన్నంముందర పంకజం రుసరుసలాడుతూనే ఉంది: "ఏమిటే బచ్చలకూరపప్పు ఇట్లా పాడుచేశావ్ ... ఇది చారా కషాయమా?" అంటూ వంకలు పెట్టింది.

"ఒసే, నీకన్న ఆ అబ్బాయి ఎంత నయమే! అన్నీ అద్భుతంగా ఉన్నాయని తినేశాడు. నిజంగా ఎంత బుద్ధిమంతుడు! దీన్ని అటువంటివాడికిచ్చి ఇంట్లో పెట్టుకోరాదుట్రా? చిలకా గోరింకలల్లే ఉంటారు!" అన్నది అవ్వగారు.

కాబోయే డాక్టరుగారి నిక్కూ, నీలుగూ, బెట్టూ, భోషాణమూ ఇంకా మరిచిపోలేకుండా ఉన్న ప్రసాదరావుకు ఈ ఆలోచన దివ్యంగా కనిపించింది. ఆయన కూతురుకేసి చూశాడు. పంకజం ఏమీ విననిదానల్లే బాగాలేదని ఆక్షేపించిన పప్పుకూరే ఆవురావురని తినేస్తున్నది.

—o—